'ఆరోగ్య సురక్ష'పై ప్రజల్లో విశ్వాసం

శ్రీకాకుళం అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్య సురక్షపై బుధవారం సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్త, ఎఎన్ఎం మొదలు వైద్యుల వరకు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించడం అత్యంత కీలకమన్నారు. గుర్తించిన రోగానికి సకాలంలో వైద్యం అందించడం వల్ల ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. లెప్రసీ, స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్స్, అంటువ్యాధుల, సీజనల్ వ్యాధులు, బిపి, షుగర్, డయాలసిస్, 104, 108 సేవలపై విభాగాల వారీగా అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎడిఎంహెచ్ఒ అనురాధ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిపిఎంఒ లింగరాజు, సి.పి శ్రీదేవి, సుజాత, ప్రవీణ్, ప్రసాద్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుజ్జగింపులు ఫలించేనా..?

- ఎంపీ బెల్లానకు ఎచ్చెర్ల బాధ్యతలు అప్పగింత
- మెత్తబడిన గొర్లె కుటుంబసభ్యులు
- ససేమిరా అంటున్న అసమ్మతి నాయకులు
- ఎమ్మెల్యే కిరణ్ కోసం పనిచేయలేమని స్పష్టీకరణ

ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపిలో అసమ్మతి పోరు పార్టీకి తలనొప్పిగా మారింది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వ్యతిరేక స్వరాలు క్రమేణా పెరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్కడ పార్టీ పరిస్థితి గందరగోళంగా ఉంది. ఇదే కొనసాగితే ఈ సీటును కోల్పోవడం ఖాయమన్న భావన పార్టీలో నెలకొనడంతో, దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను రంగంలోకి దించింది. అసమ్మతి నాయకులను బుజ్జగించి పార్టీ పరిస్థితిని చక్కదిద్దాలని సూచించింది. దీంతో ఎంపీ చంద్రశేఖర్ ఎమ్మెల్యే కిరణ్ వ్యతిరేకీయులు ఒక్కొక్కరితో మాట్లాడడం మొదలుపెట్టారు. ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.



గొర్లె కిరణ్ కుమార్

బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మూడేళ్లుగా తీవ్ర అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. ఇటీవల అవి మరింత పతాక స్థాయికి చేరుకున్నాయి. జగన్ ముద్దు... ఎమ్మెల్యే వద్దంటూ రోడ్డెక్కిన పరిస్థితికి వచ్చింది. పార్టీలో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులను చక్కదిద్దేందుకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను అధిష్టానం పంపడంతో, ఆయన బుజ్జగింపుల పర్వం మొదలుపెట్టారు. చీపురుపల్లిలోని తన క్యాంపు కార్యాలయానికి మండలాల వారీగా ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నాయకులను పిలిచి మాట్లాడడం మొదలుపెట్టారు. ఎంపీ చంద్రశేఖర్ ఆహ్వానాన్ని ఎమ్మెల్యే కుటుంబసభ్యులు మినహా మిగిలిన అసమ్మతి నాయకులు సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. తొలుత ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బావమరిది పిన్నింటి సాయి, కంది నానిని గత నెల 30న చీపురుపల్లి కార్యాలయానికి పిలిచి మాట్లాడారు. తనకు తీవ్ర అన్యాయం జరిగిందని, పార్టీ కోసం రూ.70 లక్షల వరకు ఖర్చు చేశానని ఎంపీ వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ డబ్బులను ఎమ్మెల్యే ఇచ్చేస్తారంటూ ఎంపీ చెప్పినట్లు భోగట్టా. 'చిన్న శ్రీను వచ్చి ఏం ప్రయోజనం. సొంత బావమరిదివి, నువ్వు కావాలనే అప్రతిష్ట చేస్తున్నావు' అని ఎమ్మెల్యే కిరణ్ అన్నట్లు తెలిసింది. ఎంపీ చంద్రశేఖర్ మాట్లాడిన తర్వాత కుటుంబ సభ్యులు మెత్తబడినట్లు సమాచారం.

అసమ్మతి నాయకులు ససేమిరా

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అసమ్మతి నాయకులంతా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ససేమిరా అంటున్నారు. ఎచ్చెర్ల నాయకులు జరుగుళ్ల శంకరరావు, బల్లాడ జనార్ధనరెడ్డిని చీపురుపల్లి రమ్మని కబురు పంపారు. వారు అందుకు నిరాకరించి ఎమ్మెల్యే కిరణ్‌కు టిక్కెట్ రాకుండా చేద్దాం. వ్యతిరేకించాలని మీరే చెప్పారని, ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారేంటని వారు బదులిచ్చినట్లు సమాచారం. లావేరు మండలానికి చెందిన లుకలాపు అప్పలనాయుడుకు కబురు పంపారు. పిఎసి అధ్యక్ష పదవి ఇస్తామని, ఎమ్మెల్యే గ్యాప్ ఎందుకని సహకరించాలని సూచించడంతో చూద్దామంటూ బదులిచ్చినట్లు తెలిసింది. జి.సిగడాం మండల నాయకుడు బూరాడ వెంకటరమణతోనూ మాట్లాడారు. ఎమ్మెల్యే కిరణ్‌కు టికెట్ ఇస్తే పార్టీకి పనిచేయలేనని, అలాగని పార్టీ మారనని స్పష్టం చేసినట్లు సమాచారం.

పొరుగు జిల్లా నేతల రాజకీయ క్రీడ

ఎచ్చెర్ల నియోజకవర్గంలో నెలకొన్న అసమ్మతి పోరు పొరుగు జిల్లా వైసిపి నేతలకు రాజకీయ క్రీడగా మారింది. ఎచ్చెర్లలో పాగా వేసేందుకు ఎవరికి వారే తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కాపు సామాజిక తరగతి ప్రాబల్యం ఉన్న అన్ని నియోజకవర్గాల్లోనూ బొత్స కుటుంబమే ప్రాతినిధ్యమే వహిస్తోంది. దీంతో విజయనగరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎచ్చెర్ల నుంచి పోటీ చేయాలని భావిస్తూ వస్తున్నారు. ఇదే సమయంలో ఇక్కడ పార్టీలో నెలకొన్న విభేదాలను తనకు అనుకూలంగా మార్చుకుని బరిలో దిగేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బుజ్జగింపులు బాధ్యత తీసుకున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అసమ్మతిని తగ్గించే ప్రయత్నం చేయడం, ఎవరూ వినకపోతే తానే రంగంలోకి దిగాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం.

మరోవైపు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు తన మేనల్లుడు చిన్న శ్రీనుతో కుటుంబపరంగా తీవ్ర విభేదాలు నెలకొన్నట్లు చర్చ నడుస్తోంది. పైగా విజయనగరం జిల్లాలో చిన్న శ్రీను ప్రాబల్యం అంతకంతకూ పెరిగిపోతుండడంతో చిన్న శ్రీను ఆధిపత్యం తగ్గించాలని చూస్తున్నట్లుగా తెలిసింది. చిన్న శ్రీనుకు చెక్ పెట్టేందుకు ఎచ్చెర్లలో గొర్లె కిరణ్‌కుమార్‌కు గానీ బెల్లాన చంద్రశేఖర్‌కు గానీ మద్దతు పలకాలని చూస్తున్నట్లు తెలిసింది. బెల్లానను ఎమ్మెల్యే బరిలోకి దింపి, విజయనగరం ఎంపీ సీటుకు తన సతీమణి బొత్స ఝాన్సీని రంగంలోకి దించాలని బొత్స యోచిస్తున్నట్లు పార్టీలో చర్చ నడుస్తోంది.

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

10, 11న సాగర్ కవచ్

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఈనెల 10, 11 తేదీల్లో కోస్టల్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్ (సాగర్ కవచ్ డ్రిల్)ను నిర్వహించనున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గల ఎస్‌పి ఛాంబరులో మెరైన్ పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి బాలరాజుతో సాగర్ కవచ్ డ్రిల్‌కు అవసరమైన పోలీసు సిబ్బంది, వస్తు సామగ్రి, బందోబస్తు ఏర్పాట్లపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగర్ కవచ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలోని సముద్ర తీర ప్రాంతం ఎక్కువగా ఉన్నందున ఎక్కడెక్కడ బందోబస్తు నియమించాలో ముందుస్తుగా గుర్తించి అవసరమైన సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ఎంతమంది సిబ్బంది అవసరమవుతారో వివరాలను ముందస్తుగా తెలపాలని మెరైన్ పోలీసు అధికారులకు సూచించారు. సాగర్ కవచ్ డ్రిల్ ద్వారా సముద్రంలో శత్రు దళాలపై నిఘా, గుర్తింపు గస్తీ పటిష్టం చేయాలన్నారు. వస్తు సామగ్రి, బోట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది, జిల్లా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో సాగర్ కవచ్ డ్రిల్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సిఐ ఎస్.గోవిందరావు, బారువ మెరైన్ పోలీస్‌స్టేషన్ సిఐ జె.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణానికి రూ.12 కోట్లు

శ్రీకాకుళం : కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కోట్లను మంజూరు చేసింది. ఈమేరకు జిఒ నంబరు 202ను విడుదల చేసింది. నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. స్టేడియం నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతులు రావడంతో, వీలైనంత త్వరగా టెండర్లు పిలిచి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత యంత్రాంగాన్ని కోరినట్లు తెలిపారు. గత పాలకులు ముందుచూపు లేకుండా చేసిన తప్పిదం, తీవ్ర నిర్లక్ష్యమే స్టేడియం నిర్మాణం ఆలస్యం కావడానికి కారణమని విమర్శించారు. స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈనెల 8వ తేదీ ఉదయం 7 గంటలకు కోడి రామ్మూర్తి స్టేడియం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడా ప్రేమికులంతా ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు.

జిల్లాలో మరో పరిశ్రమ ఏర్పాటు

- 700 మందికి ఉపాధి కల్పన
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఎన్ఎసిఎల్ ఆధ్వర్యాన మరో పరిశ్రమ ఏర్పాటు కానుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. రణస్థలం మండలం నారువ వద్ద 57 ఎకరాల్లో రూ.200 కోట్లతో ఈ పరిశ్రమను నిర్మించనున్నారని వెల్లడించారు. ఈ పరిశ్రమకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలో తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బుధవారం శంకుస్థాపన చేశారు. కలెక్టరేట్ నుంచి ఎన్ఎసిఎల్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావుతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. పరిశ్రమ ఫౌండేషన్ స్టోన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 200 మందికి, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మేరకు ఈ పరిశ్రమ ఏర్పాటు కానుందని చెప్పారు.

ఎన్ఎసిఎల్ డైరెక్టర్ వరదరాజులు మాట్లాడుతూ జీవ సంబంధ పదార్థాలతో ఆర్గానిక్ ఎరువులను ఇక్కడ తయారు చేయనున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో దీన్ని నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. రానున్న ఏడాదిన్నర కాలంలో దీని నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ యతిరాజులు, నాగార్జున అగ్రికమ్ లిమిటెడ్ ఐఆర్ హెడ్ కె.శ్యామ్‌ప్రసాద్, డిజిఎంలు వర్మ, వి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ స్టోన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జగన్‌పై ప్రజల్లో తిరుగుబాటు

- నేటి నుంచి బాబు అరెస్టుపై ఇంటింటా ప్రచారం
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. రానున్న రోజుల్లో వైసిపి నాయకులు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితులు నెలకొంటాయని చెప్పారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆధారాల్లేకుండా అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడంపై గురువారం నుంచి ఇంటింటా ప్రచారం చేసి ప్రజలకు వివరిస్తామన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై 22 రోజులుగా జిల్లాలో చేపడుతున్న రిలే దీక్షలను నిలిపివేసి నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి జరుగుతున్న పరిణామాలను వివరిస్తామన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, లోకేష్ సతీమణి బ్రాహ్మణి ప్రజల్లోకి రావడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఇదే పట్టుదలను చంద్రబాబు సిఎం అయ్యేంత వరకు కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బాబు అరెస్టును ఖండిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాంతియుతంగా దీక్షలు, నిరసనలు, ర్యాలీలు చేస్తుంటే జిల్లా పోలీసు యంత్రాంగం నియంతృత్వంతో వ్యవహరించిందన్నారు. నాయకులను అక్రమ పద్ధతిలో అరెస్టులు, గృహ నిర్బంధం చేయడం, అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. పోలీసు అధికారుల నియంతృత్వ పోకడలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగన్ రాజ్యాంగాన్ని అనుసరించి పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని విమర్శించారు.

చంద్రబాబును కేవలం రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని విమర్శించారు. ఇంకా ఆధారాలను సేకరిస్తున్నామని సిఐడి అధికారులు చెప్తూ న్యాయస్థానాలను సైతం పక్కదారి పట్టిస్తున్నారన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు భూకబ్జాలు, ఇసుక అక్రమ రవాణా, పేకాట శిబిరాలపై పోలీసు అధికారులు ఎందుకు దృష్టిపెట్టడం లేదని ప్రశ్నించారు. తమ పార్టీ నాయకుల వల్ల జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రత సమస్య ఏర్పడిందని పోలీసులు నిరూపించగలరా అని అన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరగోపాల్, బిసి సెల్ అధ్యక్షులు కలగ జగదీష్, కలగ గోపాల్, పట్నాల పార్వతీశం, ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి - కొత్తూరు

అర్జీదారులు అందజేసే ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి బుధవారం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ సంబంధిత అధికారులకు సమస్యలు వివరిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించాలని మెట్టూరు బిట్-3 నిర్వాసితులతో కలిసి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగరాపు సింహాచలం, సిర్ల ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. వెలుగు సంస్థలో పనిచేస్తున్న విఒఎలకు ఉద్యోగభద్రత కల్పించాలని వినతిపత్రం అందజేశారు. బమ్మిడిలో ఉన్న ఇనాం భూములను రైతుల పేరున మార్చాలని సర్పంచ్ ప్రతినిధి వి.సూర్యనారాయణ కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపిడిఒ ఆహ్వానించలేదని పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు. సిరుసువాడ నుంచి ఎబి రహదారి అధ్వానంగా ఉందని మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపిడిఒ పావని, పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఆలయాన్ని సందర్శించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. దాతల తోడ్పాటుతో అరసవల్లిని మరింత అభివృద్ధి చేసేందుకు వీలుందన్నారు. అందుకు అవసరమైన సహకారాన్ని తాను అందిస్తున్నట్టు తెలిపారు. సంస్కృతి పరిరక్షణ భవిష్యత్ తరాలకు అందించడం ఎంతో అవసరమన్నారు. ధర్మ ప్రచార కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు భాగస్వామ్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావు, దుక్క గన్నిరాజు, జె.శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, ద్వారపు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ధర్మానకు చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఇఒ, పాలకమండలి సభ్యులు

శతశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

గార : జిల్లాలో శత శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని అంపోలు, శ్రీకూర్మం ప్రాంతాల్లో పంట క్షేత్రాలను బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పంట నమోదు రికార్డులను పరిశీలించారు. పంట విస్తీర్ణం, పంట రకం, పాసు పుస్తకాలు, ఈ-పంట నమోదు యాప్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ-క్రాప్ నమోదు సమయంలో బయోమెట్రిక్ అథంటికేషన్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్, శ్రీకాకుళం ఎడి రజని, తహశీల్దార్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యమని ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. పెద్దపాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. కృషి, పట్టుదల ఉంటే అనుకున్నది సాధించవచ్చన్నారు. తానూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని పట్టుదలతో ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. అబ్దుల్ కలాం సూత్రాలతో పిల్లలకు పుస్తకాలు అందజేశారు. చదువులో చురుగ్గా ఉన్న విద్యార్థులకు నగదు రూపంలో బహుమతులు అందించారు. రెసిడెన్షియల్ హాస్టల్‌లో కరెంట్ కోతల సమయంలో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని ఇన్వెర్టర్లకు డాక్టర్ దానేటి ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ.లక్ష చెక్కును అందించారు. బాగా చదువుకుని ప్రభుత్వ మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు సాధించిన విద్యార్థుల విద్యా సంబంధిత ఆర్థిక సహాయాన్ని తమ ట్రస్టు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిఒ బాలాజీ, ప్రిన్సిపల్ జ్యోతి, రమణమూర్తి, చిన్ననాయుడు, చలం తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న దానేటి శ్రీధర్

హోటల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా శ్రీను

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు అండ్ ఫంక్షన్ హాల్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా బస్వా శ్రీనివాసరావు (ట్రాఫిక్ జాం శ్రీను) ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని 80అడుగుల రోడ్డులో ఉన్న బృంధావనం ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోషియేషన్ గౌరవాధ్యక్షునిగా ఎన్‌డివిడి మురళీ, నగర గౌరవాధ్యక్షునిగా సబ్బి నాగేశ్వరరావు, బరాటం వాసుదేవరావులు ఎన్నికయ్యారు. నగర అధ్యక్షుడిగా అంధవరపు తిరుమలరావు(అభిరుచి తిరుమల), ఉపాధ్యక్షులుగా అరవల సతీష్, టంకాల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తుంబలి సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా గురుగుబిల్లి రాజు, ట్రెజరర్‌గా కట్టా భవానీ శంకర్, జాయింట్ సెక్రటరీగా కె.గణపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అందవరపు సతీష్, కస్పా మణి ఎన్నికయ్యారు. వారితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్ట నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌పి స్వామి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రఘువీర్, కోశాధికారి వెంకట పూర్ణచంద్, నాగావళి ఆనంద్ హాజరయ్యారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా పూర్వ అధ్యక్షుడు జామి రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ గోవిందరాజులు (ఆనందసాయి), నాయకులు పాల్గొన్నారు.

నాక్ బృందం కళాశాల పరిశీలన

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపునకు కర్నాటక రాష్ట్రం హాసన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ టి.సి తార్నాత్, రాజస్థాన్ రాష్ట్రం సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగేంద్ర అంబేద్కర్ సోల్, తమిళనాడు కావేరి ఉమెన్స్ కళాశాల ప్రొఫెసర్ వి.సుజాతతో కూడిన బృందం బుధవారం కళాశాలను పరిశీలించింది. కళాశాల వాతావరణం, మైదానం, భవనాల నిర్మాణం, అధ్యాపకుల వివరాలు, మౌలిక సదుపాయాలు, గ్రంథాలయం, రీడింగ్ రూం, తరగతి గదులు తదితర వాటిని పరిశీలించింది. టెక్కలిలో డిగ్రీ కళాశాలతో పాటు పిజి కళాశాల ఏర్పాటు, ఉన్నత కోర్సులు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే వంటి కోర్సులను ప్రవేశానికి సంబంధించి కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ప్రతిపాదన చేశారు. ఒడిశా రాష్ట్రానికి సమీపంలో టెక్కలి ఉన్న కారణంగా చదువు ఆవశ్యకత, విద్యార్థులకు అందుబాటులో కళాశాల ఉండడం వంటి అంశాలను ప్రస్తావించారు. కళాశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాక్ బృందం పర్యటనలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మతో పాటు వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్ కుమార్, కోఆర్డినేటర్ ఎ.రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఇఇ సుగుణాకరరావు

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం వద్దు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరణ పనుల్లో ఎందుకు జాప్యం వహిస్తున్నారని, త్వరితగతిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని శ్రీకాకుళం మున్సిపల్ ఇఇ సుగుణకరరావు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. సెప్టెంబరు 29న 'ప్రజాశక్తి'లో 'చేసింది గోరంతా... హడావుడి కొండంత' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరణ పనులు, కిడ్నీ ఆస్పత్రి ఇంజినీరింగ్ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు, రోడ్లపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్షణమే పక్కకు మార్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ వైరింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అరకొరగా ఉన్న కాలువ పనులు, కాలువపై పలకలు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. తారు రోడ్డు నిర్మాణానికి ముందు రోడ్డుకు ఇరువైపులా బెర్మల్, గ్రావెల్ లేయర్లు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వద్ద కాలువ పనులు చేపట్టేందుకు ఆర్అండ్‌బి అధికారులతో చర్చించి కాలువ జాయింట్ పనులు చేపట్టే విధంగా చర్యలు చేపడతామన్నారు. కిడ్నీ ఆస్పత్రి పనులు ఎంత వరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. విస్తరణ పనులు, కిడ్నీ ఆస్పత్రి పనులు పరిశీలన చేసేందుకు ప్రతి మంగళవారమూ వస్తానని చెప్పారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ డిఇఇ జి.సునీల్ కుమార్, ఎఇ అవినాష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

తేజేశ్వరికి ఉద్యోగోన్నతి కల్పించాలి

టెక్కలి రూరల్ : నందిగాం మండలం ఎస్.ఆర్.కె.పురం అంగన్వాడీలో హెల్పర్‌గా పనిచేస్తున్న మజ్జి తేజేశ్వరికి కార్యకర్తగా ఉద్యోగోన్నతి కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మనాయుడు, జిల్లా కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు, జిల్లా నాయుకులు నంబూరి షణ్ముఖరావు డిమాండ్ చేశారు. టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సవరరామకృష్ణాపురం అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి ఇంటర్వ్యూలు నిలుపుదల చేయాలన్నారు. అంగన్వాడీ కార్యకర్త ఉద్యోగ విరమణ పొందారని, ప్రభుత్వ జిఒ ప్రాప్తికి హెల్పర్‌గా పనిచేస్తున్న తేజేశ్వరికి ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. తేజేశ్వరి డిగ్రీ ఉత్తీర్ణత సాధించారని, కార్యకర్తకు అర్హులని తెలిపారు. దీనిపై హైకోర్టులో తేజేశ్వరి పిటిషన్ దఖలు చేశారని, ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ పిఒ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ఆదిలక్ష్మి, నాయుకులు పి.పద్మావతి, ఎ.రమాదేవి, బి.మల్లేశ్వరి, టి.కృష్ణవేణి, పి.అన్నపూర్ణ, జ్యోతి సోమేశ్వరి, ఉమాభాయి పాల్గొన్నారు.

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష'

కవిటి : స్టాల్స్‌ను పరిశీలిస్తున్న రామారావు, సాయిరాజ్

నౌపడ : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రజాశక్తి- పోలాకి

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని జడూరు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ దమయంతి బైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కణతి కృష్ణారావు, సర్పంచ్‌లు గొల్లంగి అసిరితాత, ముద్దాడ రాము, దంత వెంకట రమణ పాల్గొన్నారు.

రణస్థలం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కోరారు. మండలంలోని చిల్లపేటరాజాం గ్రామ సచివాలయం పరిధిలోని చిల్లపేటరాజాంలో "జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, డిటి శ్రీనివాసరావు, డాక్టర్లు సుమన్, గిరిబాబు, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

లావేరు : మురపాక సచివాలయం-2లో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, చిన్నయ్యపేట సర్పంచ్ కలిశెట్టి భాస్కరరావు, ఎంపిడిఒ కుప్పలి సురేష్ కుమార్, ఇఒపిఆర్‌డి విశ్వేశ్వరరావు, మురపాక పిహెచ్‌సి వైద్యాధికారులు జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మర్రిపాడు-సిలో జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, మండల కన్వీనర్ పల్లి యోగి, వైద్యాధికారులు హేమంతలక్ష్మి, గ్రీష్మ, అలేఖ్య, పావని పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: కిడ్నీ వ్యాధుల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నెఫ్రాలజీ వైద్యులు శరత్ జ్యోత్స్న అన్నారు. మండలంలోని చీపురుపెల్లి పంచాయతీ గడూరు ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహించారు. ఉద్దానం ప్రాంతంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాల్లో కిడ్నీ రోగులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఒక్కరూ కిడ్నీకి సంబంధించిన వైద్య పరీక్షలు విధిగా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసుమ పాపారావు, అక్కుపల్లి పిహెచ్‌సి వైద్యులు దువ్వాడ దివ్య, విజయ్ కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, కార్యదర్శి అప్పారావు, ఎంపిటిసి గుణ, రాజారావు పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం శిబిరం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, నర్తు నరేంద్ర, పాండవ శేఖర్, పూడి నీలాచలం, బెందాలం రమణమూర్తి పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం హనుమంతనాయుడు పేట పంచాయతీలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆరోగ్య సురక్షను ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నౌపడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: మండలంలోని చినంచలమంలో ఆరోగ్య సురక్షలో 307 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, న్యూరాలజీ 22, గుండెకు సంబంధించిన వ్యాధులు 4, కళ్లకు సంబంధించి 6, చర్మ వ్యాధులు 2, దంతాలకు సంబంధించి వ్యాధులు 9, కిడ్నీ సంబంధించిన వ్యాధితో ఇద్దరు బాధపడుతుండడం గుర్తించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, మండల పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వైద్యులు శ్రీలేఖ, ప్రజ్వాల్, రెంటికోట వైద్యాధికారి ప్రశాంతి, టి.సునీల్ కుమార్, అంజలి పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని కమలాపల్లిలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పాల్గొని రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అచ్చుతాపురం వైద్యాధికారిని పి.సుజాత పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని జగన్నాథపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, మండల అధ్యక్షులు నూక సత్యరాజు, నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

రణస్థలం : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పొందూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పొందూరు: మండలం విఆర్ గూడెం గ్రామంలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 312 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, వైద్యాధికారులు ఎస్.మల్లీశ్వరమ్మ, జి.రమేష్‌నాయుడు, సిహెచ్‌ఒ వాణికుమారి, ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి, సూపర్‌వైజర్ మణిప్రసాద్, ఎఎన్‌ఎం పరమేశ్వరి పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని పెద్దపేట పంచాయితీ పరిధిలో మదనాపురంలో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఎంపిపి కర్నేన దీప, జడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు ఆరోగ్య సురక్షను ప్రారంభించారు. ఈ మేరకు రిమ్స్ ఆస్పత్రి వైద్యులు బూర్జ గోదావరి, పావని, రాజశేఖర్, రమ్యశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కరణం కృష్ణం నాయుడు, మాజీ ఎఎంసి డైరెక్టర్ గుమ్మడి రాంబాబు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ ఎస్.రమణారావు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, సర్పంచ్‌లు మహేష్, గోవిందరావు పాల్గొన్నారు.

జాబ్ కోర్సులపై ఆర్మీకాలింగ్ శిక్షణ

శిక్షణ ఇస్తున్న రమణ

శ్రీకాకుళం అర్బన్: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ ఆధ్వర్యంలో సైన్యంలో అధికార హోదా ఉద్యోగాలపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వి.రమణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో సోల్జర్‌గా మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, ఆఫీసర్ క్యాడర్ ఉద్యోగాలు ఉన్నప్పటికీ సరైన అవగాహన లేక కింది స్థాయి ఉద్యోగాలకు యువత పరుగులు తీస్తున్నారని ఐఎసి డైరెక్టర్ బి. వి. రమణ అన్నారు. ఇంటర్ విద్యతో సైన్యంలో ఉన్నతాధికార ఉద్యోగాలు ఉన్నప్పటికీ వాటిపైన అవగాహన లేక కింది స్థాయి ఉద్యోగాలకు యువత మక్కువ చూపుతున్నారన్నారు. దీనికి పరిష్కారంగా యువతకు సైన్యంలో అధికార ఉద్యోగాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి భారత రక్షణ వ్యవస్థ, ఏయే క్యాడర్‌లో ఏయే రంగాల్లో ఉద్యోగాలు ఉంటాయి, ప్రవేశ మార్గాలపై సైన్యంలో చేరిన తరువాత సైన్యం కల్పించిన మౌలిక సదుపాయాలతో పాటు మహిళలకు రక్షణ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ సైన్యం పట్ల ఇటువంటి అవగాహన సదస్సు అవసరమని సైన్యం అంటే వార్ ఫ్లీడ్ మాత్రమే కాదు అనేక రంగాల్లో ఉన్నయని యువత గమనించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరింటలో 'ఉపాధి' గ్రామసభ

ప్రజాశక్తి- పొందూరు

మండలం గోరింట గ్రామంలో సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ఉపాధిహామీ పథకం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో చేపట్టనున్న ఉపాధిహామీ పనులతో పాటు పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతాడ కృష్ణవాసుదేవరావు, పంచాయతీ సెక్రటరీ మనోజ్‌కుమార్, ఇసి సందీప్, టిఎ విజయ్‌కుమార్, ఎఫ్ఎ మంగమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీలక్ష్మి

హౌసింగ్ రుణాల పేరుతో టోకరా

ప్రజాశక్తి- రణస్థలం

పోలీస్ స్టేషన్‌లో ఉన్న శివ

విశాఖపట్నం జిల్లా గణేష్ నగర్, అరిలోవకు చెందిన తలాడ శివ ప్రయివేటు బ్యాంకుల్లో హౌసింగ్ రుణాలు ఇప్పిస్తామని మోసం చేయడంతో బాధితులు శివను బుధవారం సాయంత్రం జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. శివ ల్యాప్ టాప్ పట్టుకుని మండలంలోని తిరుగుతూ డీ పట్టా, గ్రామ కంఠం భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రయివేటు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తానని రూ.25 లక్షలు వసూళ్లు చేశారు. ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్ ఫీజులంటూ నమ్మించాడు. తొంభై నుంచి నూటా ఇరవై రోజుల లోపు రుణాలు ఇప్పిస్తానని చెప్పాడు. తీరా గడువు ముగియడంతో బాధితులు ఆందోళన చెందిన ఫోన్లు చేశారు. ఫోన్ ఎత్తకపోవడం, తప్పించుకు తిరగడం చేశాడు. దీంతో బాధితులు విశాఖ వెళ్లి అక్కడ నుంచి తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు.

గోపికి 'హరివిల్లు కవి విశారద' పురస్కారం

ప్రజాశక్తి- కవిటి

గోపి

చిట్టి చిట్టి కవితలతో ఎనిమిది వందల హరివిల్లు కవితలు పూర్తిచేసిన మొర్రి గోపి మాస్టారికి భద్రాద్రి సాహితి వేదిక, కొత్తగూడెం జిల్లావారు ఆన్‌లైన్ వేదికగా బుధవారం 'హరివిల్లు కవి విశారద' పురస్కారం అందజేశారు. ఈ మేరకు భద్రాద్రి సాహితీ వేదిక అధ్యక్షుడు సీర హరిప్రసాద్, కార్యదర్శి చిట్టి మధు, హరివిల్లు ప్రక్రియ రూపకర్త మామిడి రమేష్ మాస్టారికి అభినందనలు తెలియజేశారు. అలతి పదాలతో అద్భుతమైన భావాలు పలికిస్తూ తెలుగు సాహితీ సేవలో నిరంతర ప్రయాణం చేస్తున్న కవిటి మండల ఉపాధ్యాయుడు మొర్రి గోపికి పురస్కారం లభించడంపై మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘ ప్రతినిధులు పాండవ శేఖర్, ఆరంగి మధు, ఆరంగి త్రివిక్రమరావు, తమరాల జయరాం, పొల్లయి లక్ష్మణమూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట ప్రధానోపాధ్యాయులు జి.శాంతి, మండల ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగారావు, త్రిలోచనభిసాయి, పండి కృష్ణారావు, శమళ్ల రాజబాబు, బల్ల ధర్మారావు, శ్రీరామ్మూర్తి, బిసాయి అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న అరుణ

ఎన్ఐఎ దాడులను ఖండించాలి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వాల విధానాలను ప్రశ్నించినందుకే ప్రజా సంఘాల నాయకుల ఇళ్లల్లో ఎన్ఐఎ దాడులు చేస్తున్నారని, దీన్ని ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు ముక్తకంఠంతో ఖండించాలని వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడులో అమరవీరుల స్మారక మందిరంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రిధానేష్ అధ్యక్షతన వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు, మహిళా సంఘాలు ప్రజాస్వామ్య వాదులు బుధవారం సమావేశం నిర్వహించారు. ముందుగా ఉత్తరాంధ్ర మహిళా సంఘం బాధ్యులు పోతనపల్లి అరుణ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో పిడిఎం నాయకులను నోటీసులు ఇవ్వడం, సోదాలు చేయటం అప్రజాస్వామిక చర్యగా అభిప్రాయపడుతున్నామని అన్నారు. ఎబిఎన్ఎస్ సభ్యుల ఇళ్లల్లో తనిఖీలు చేసి భయభ్రాంతులను గురిచేయడం, చుట్టుపక్కల ప్రజలనూ ఇబ్బంది చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇలాంటి నిర్బంధాలు ఎమర్జెన్సీ కాలంలోనూ లేవని అన్నారు. సమావేశంలో దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు లక్ష్మణరావు, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయక అధ్యక్షుడు నీలకంఠం, అమరుల బంధుమిత్రుల రాష్ట్ర కమిటీ సభ్యులు కోదండరావు, మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచనారావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా బాధ్యులు పోతనపల్లి కుసుమ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బాలకృష్ణ, ప్రగతిశీల కార్మిక సమైక్య నాయకులు మద్దిల ధర్మారావు, పౌర హక్కుల నాయకులు పిండి వెంకటరావు పాల్గొన్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లారీ నుంచి మంటలు

సోంపేట : మండలంలోని లక్కవరం జాతీయ రహదారి వద్ద బుధవారం మధ్యాహ్నం ఆగి ఉన్న లారీలో మంటలు చెలరేగాయి. కోయంబత్తూరు నుంచి కలకత్తాకు టీ పొడితో వెళ్తున్న లారీ లక్కువరం జాతీయ రహదారి వద్ద నిలుపుదల చేశారు. కొంత సమయం తర్వాత ఆకస్మాత్తుగా లారీలో నుంచి మంటలు చెల రేగాయి. దీనిని గమనించిన డ్రైవర్ ఖాదర్ ఖాన్ వెంటనే బయటకు పరుగు తీశాడు. సమాచారం తెలుసుకున్న సోంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారి వరహాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.మోహనరావు, విజయ్ కుమార్, రమణ పాల్గొన్నారు.

గోతుల రోడ్డుతో ఇక్కట్లు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

కొల్లిపాడు రోడ్డులో చేరిన వర్షపునీరు

మండలంలోని పాతమేఘవరం నుంచి మేఘవరం, మరువాడ నుంచి బోరుభద్రకు వెళ్లే రహదారి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కొల్లిపాడు వద్ద ద్విచక్ర వాహనదారుడు గోతిలో అడడంతో ఇద్దరు గాయపడ్డాడు. ఈ రెండు రహదారులూ నిత్యం రద్దీగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు, భవనాల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వాహన చోదకులు తీవ్ర ఆవస్తలు పడుతున్నారు. వర్షం వచ్చింది అంటే గోతుల్లో నీరు చేరడంతో గోయ్యో, రోడ్డో తెలియని పరిస్థితి అని వాహన చోదకులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధిలు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఆంధ్రా మెడికల్ ఎడ్యుకేటర్స్ సమావేశాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపి మెడికల్ 2023 పేరిట ఆంధ్రా మెడికల్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ 13వ వార్షిక సమావేశాలు జిల్లాలోని రాగోలులో గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ అండ్ ఆస్పత్రిలో గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కార్యనిర్వహక కమిటీ చైర్మన్ డాక్టర్ డి.లక్ష్మి, కో-చైర్మన్ డాక్టర్ హవీలా ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు దేశ వ్యాప్తంగా వైద్యవిద్యా రంగంలో నిపుణులు హాజరై ఉపన్యసించనున్నరని తెలిపారు. గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ అండ్ హాస్పిటల్ చీఫ్ మెంబర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ఈ సమావేశాలను ప్రారంభిస్తారని, వైద్య అద్యాపకులందరూ పాల్గొని తమ జ్ఞానాన్ని అందించాలని కోరారు.

టి.శాసనంలో పల్లెనిద్ర

సోంపేట: మండలంలోని టి.శాసనంలో బుధవారం రాత్రి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పల్లెనిద్ర చేశారు. ఉదయం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామంలోని విశ్రాంత ఉపాధ్యాయుడు వేదుల్ల మాధవరావు ఇంట్లో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు స్థానిక గ్రామస్తులు, మహిళలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన పల్లెనిద్రలో భాగంగా గ్రామంలో ఉంటున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉంటూ సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చేపడతామని తెలిపారు.

రాయితీలు కల్పించడంపై హర్షం

పలాస : వయో వృద్ధులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి ఆర్‌టిసిలో రాయితీ సౌకర్యం కల్పించడంపై విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల దాటిన వయోవృద్ధులకు ఆర్‌టసి బస్సుల్లో ప్రయాణ ఛార్జీలపై 25 రాయితీ కల్పించారని అన్నారు. బస్సు ముందు ద్వారం నుంచి వరుస మూడు సీట్లు వృద్ధులకు రిజర్వ్ చేస్తూ ఆర్‌టిసి ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని అన్నారు.

గౌతు శిరీష పరామర్శ

పలాస : వజ్రపుకొత్తూరు మండలం మంచినీళపేటకు చెందిన టిడిపి నాయకులు కారి డానియల్‌పై వైసిపి నాయకులు దాడి చేయడంతో గాయపడ్డారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న డానియల్‌ను బుధవారం పరామర్శించారు. గాయపడిన వ్యక్తితో దాడికిగల కారణాలను అడగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, పాపారావు ఉన్నారు.

పరామర్శిస్తున్న గౌతు శిరీష

బస్తాలను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

45 బస్తాల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పెద్దకోమటి వీధిలో మనోహర్ ఇంట్లో అక్రమంగా నిర్వహించిన 45 బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సోంపేట, ఇచ్ఛాపురం, పలాస సిఎస్‌డిటిలు కూర్మారావు, సంతోష్, రవి బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 45 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా సివిల్ సప్లయి అధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు వారు తెలిపారు.

మీడియాపై దాడులు తగవు

టెక్కలి : కేంద్రంలో ఆధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మీడియాపై దాడులు చేయడం తగదని మీడియా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్ అనుబంధ సంస్థ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో అన్నారు. రెండు ధపాలుగా కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, దీనిని మీడియా ప్రచారం చేస్తే ఉగ్రవాద చట్టం మోపి దాడులు చేయించి భయపెట్టాలను కోవడం తగదని అన్నారు.

రేపు మహాధర్నా

నౌపడ : సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 6న మహాధర్నా నిర్వహిస్తున్నామని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడల చాపర వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, టిడిపి అధ్యక్షులు జీరు భీమారావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సంక్షేమం, అభివృద్ధి సిఎం జగన్మోహన్‌రెడ్డికి రెండు కళ్లని ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని మశాకపురంలో ఉపాధి హామీ, ఐసిడిఎస్ నిధులు రూ.7.50 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. అలాగే లొద్దపుట్టిలి పంచాయతీ జగన్నాథపురంలో జెడ్‌పి, ఎంపిపి నిధులు రూ.4.50 లక్షలతో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంత భవనాన్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఇరత రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గడపగడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ అశి పురుషోత్తం, సర్పంచ్ ఆసి సులోచనరెడ్డి, ఎంపిటిసి పిట్ట హేమలత పాల్గొన్నారు.

సైనికులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : దేశ రక్షణ విధుల్లో ఉన్న ఆర్మీ అధికారులు, జవాన్లు సిక్కింలో తీస్తా నదిలో ఉత్పన్నమైన ఆకస్మిక వరదలో గల్లంతు కావడంపై శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రకృతి శాంతించి, వారంతా సురక్షితంగా ఈ ఆపద నుండి బయటపడాలని ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమని, జవాన్ల కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. ఈ ఆపద సమయంలో దేశమంతా వారి వెంటే ఉంటుందని ధైర్యం చెప్పారు.

రమేష్‌కు శుభాకాంక్షలు

రమేష్‌కు పూలమాల వేస్తున్న కృష్ణదాస్

కవిటి: జిల్లా వాలీబాల్ ఉప కార్యదర్శిగా ఎన్నికైన ప్రగడపుట్టుగకు చెందిన బల్లెడ రమేష్‌కు జిల్లా వాలీబాల్ అసోసియేషన్, స్థానిక ఉషోదయ యువజన సంఘం సభ్యులతో పాటు హితులు, సన్నితులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఎన్నిక శ్రీకాకుళంలోని ఎస్‌జిఎఫ్ భవనంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. నరసన్నపేట, ఒలంపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీలో రమేష్ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వాలీబాల్‌కు చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా వాలీబాల్ సంఘానికి ఉప కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉద్దానం ప్రాంతంలో వాలీబాల్ మరింత మెరుగుపడేటట్లు కృషి చేయాలని కృష్ణదాస్ రమేష్‌కు సూచించారు.

ఉత్సవాల విజయవంతానికి చర్యలు

అధికారులతో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజలు అందరి సహకారంతో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలు విజయవంతం చేయాలని వైసిపి యోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. కొత్తమ్మతల్లి ఉత్సవాల ఏర్పాట్లను, నిర్వాహణ తీరుపై అన్ని శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళితో మాట్లాడుతూ పోలీసు బందోబస్తు, పార్కింగ్, తదితర అంశాలపై సమీక్షించారు. క్యూలైను ఏర్పాటు, దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు మౌలిక సదుపాయాలు గురించి చర్చించారు. అలాగే వైద్య సౌకర్యాల నిర్వహణపై వైద్య సిబ్బందితో మాట్లాడారు. మూడు రోజులు విద్యుత్ సరఫరాపై అ శాఖ అధికారులతో చర్చించారు. అన్నదానం, తాగునీరు ఏర్పాటు పలు సూచనలు చేశారు. ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, రామకృష్ణ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఎస్ఐ షేక్‌మహ్మద్‌అలీ పాల్గొన్నారు.



పోస్టర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

'గడప గడప'కు సంక్షేమం

ప్రజాశక్తి- జలుమూరు

సిఎం జగన్మోహన్‌రెడ్డి గడపగడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని తిమడాం, దంపాక, సురవరం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేత పథకాలను వివరించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో సిఇసి రాష్ట్ర సభ్యులు ధర్మాన పద్మప్రియ, ఎంపిపి వాన గోపి, మండల అధ్యక్షులు కనుసు సీతారాం, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు దామ మన్మథరావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

రాష్ట్రాభివృద్ధికి జగన్ మళ్లీ సిఎం కావాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రజలు, రాష్ట్రం అభివద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని దానికోసం మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం లావేరు మండలం సుబద్రపురం లో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా పాల్గొన్నా ఎమ్మెల్యే కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కి మళ్ళీ జగనే యందుకు కావాలంటే అంటు పేద ప్రజలు కు మేలు జరిగి అభివద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ కావాలంటే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉంది ని అన్నారు. రాష్ట్రంలో ని కొన్ని ప్రాంతాలుకు కొన్ని వర్గాలకే పరిమితం కాకుండా రాజధాని వికేంద్రీకరణ ప్రభుత్వ మెడికల్ కళాశాలు పోర్టులు పరిశ్రమలు ఐటి రంగం పాఠశాలు ఆసుపత్రిలు జగనన్న సురక్ష వంటి తదితర పథకాలు ఎన్నో కార్యక్రమలు కొనసాగి ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ అభివద్ధి కావాలంటే మళ్ళీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని చెయ్యాల్సిన బాధ్యత ప్రజాలుదేనని చెప్పారు ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలక్రిష్ణ జడ్పీటీసీ మీసాల సీతంనాయుడు మండల పార్టీ అధ్యక్షుడు డి రాజీనాయుడు జె సి యస్ ఇంచార్జి మీసాల శ్రీనువాసురావు ఉపాధ్యక్షుడు లుకలాపు శ్రీనువాసురావు బురాడా చిన్నారావు దేశెట్టి తిరుపతిరావు పలువురు సర్పంచ్లు ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు

ఎటిఎం మోడల్‌లో కూరగాయల విత్తనాలు వేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎటిఎం మోడల్ పద్ధతిలో వ్యవసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో వేలుపురాయి గ్రామంలో గొర్లె సూర్యకాంతంకు చెందిన 10సెంట్లు పొలంలో కూరగాయలు పంటను ఎటిఎం మోడల్ పద్ధతిలో బుధవారం వేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోవిందరెడ్డి కృష్ణ, సన్యాసిరావు మాట్లాడుతూ ఎటిఎం మోడల్‌లో ఒక బెడ్డ వెడల్పు నాలుగు అడుగులు మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకొని ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్డపై దుంప జాతి రకాలైన ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, కాయగూరలైన వంగ, టమోటా, బెండ, చిక్కుడు, మిరప, ఆకుకూరలైన తోటకూర, గోంగూర, జొన్న, సజ్జ తదితర పంటలు నిర్ణీత కొలతల ప్రకారం వేసుకుంటే 365 రోజులు ప్రకతి వ్యవసాయ పద్ధతులు మంచిగా ఆచరించడం వలన నిరంతరం కూరగాయలు దిగిబడిన పొందవచ్చునని రైతులకు సూచించారు. నేలను 365 రోజులు కప్పి ఉంచవచ్చునని, ఇలా చేయడం వలన పౌష్టికాహారంతో పాటు మంచి నేలలు కూడా తయారై చీడపీడల యాజమాన్యం సులువుగా చేసుకోవచ్చునన్నారు. ఈ విధంగా మోడల్స్ వేయడం వలన తక్కువ ప్రదేశంలో ఎక్కువ ఆదాయం, ఎక్కువ రకాల పంటలు పండించుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది, మోడల్ మేకర్ జి.రాంబాబు, పి. సత్యన్నారాయణ, రాజు, సునీత, జ్యోతి, సత్యవతి, మాధవి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నీలవేణి

ధర్మపురంలో ప్లాంట్ హెల్త్ క్లినిక్

ప్రజాశక్తి- పొందూరు

మండలం ధర్మపురం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్లాంట్ హెల్త్ క్లీనిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరిలో పాముపొడ తెగులు నివారణ, మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారణ, భూమి ఆరోగ్యాన్ని కాపాడడం కోసం రైతులు ద్రవ జీవన ఎరువుల వాడకం వంటి పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నీలవేణి, రిలయన్స్ ప్రతినిధులు తిరుమలరావు, రాజారావు, రైతులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని బొడ్డకాల్లిలో గ్రామీణ విత్తనోత్పత్తి కథకంపై ఎడిఎలు వెంకటరావు, జగన్మోహనరావు బుధవారం అవగాహన కల్పించారు. విత్తనోత్పత్తి పథకం ద్వారా చీడపీడ పురుగుల నుంచి వ్యవసాయాన్ని ఎలా కాపాడుకోవాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రైతుల సమస్యలు పరిష్కారానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ఎఒ సూర్యకుమారి, సర్పంచ్ చల్లా కృష్ణారెడ్డి, అభ్యుదయ రైతులు లండ పీతాంబర, లండ కృష్ణారెడ్డి, బొచ్చు మోహనరావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రాష్ట్రంలో అరాచక పాలన

పలాస : కళ్లకు గంతలు కట్టి నిరసన తెలుపున్న నాయకులు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. చంద్రబాబు రిమాండ్‌ను నిరసిస్తూ... చేపట్టిన టిడిపి నిరసన దీక్ష బుధవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ముందుగా స్వామీ వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ బిసాయి, ఉప్పాడ ఉమాపతిరెడ్డి, కౌన్సిలర్ నారాయణ బెహరా, పనపాన సోమేశ్వరరావు, ఉప్పాడ పద్మనాభం, బలరాం జిన్నా, మురళి బిసాయి, దక్కత ఢిల్లీరావు, ఆసి లీలారాణి, కొండ శంకర్‌రెడ్డి, నందిక జాని, కాళ్ల దిలీప్‌కుమార్, పద్మనాభం, సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వం అరాచకం సృష్టిస్తుందని, అక్రమ అరెస్టులు చేస్తూ జైలుకు పంపిస్తున్నారని, అందులో భాగంగానే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును జైలుకు పంపించారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గలో టిడిపి కార్యాలయం వద్ద మీకు, మీ పాలనకు ఒక దండం అంటూ టిడిపి నాయకులు కళ్లకు గంతలు కట్టి వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, మల్లా శ్రీనివాసరావు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నేను సైతం బాబు కోసం రిలే నిరాహార దీక్షకు టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఇచ్ఛాపురం : దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే అశోక్

నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, బోనెల అప్పారావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, ఎంపిటిసిలు బొడ్డేపల్లి సుగుణ, అన్నెపు భాస్కరరావు, ధన్నాన సూర్యం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలో శ్రీశయన మండల శాశత అద్యక్షుడు నాయకులు లొట్టి రామారావు, టిడిపి మండల అద్యక్షుడు బోయిన రమేష్, రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఎంపిపిలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ... నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నాయకులు సింతు సుధాకర్, రోణంకి కళ్యాణ్ పాల్గొన్నారు.

సకాలంలో పెన్షన్లు చెల్లించాలి

ప్రజాశక్తి- రణస్థలం

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు సకాలంలో చెల్లించాలని రణస్థలం, లావేరు మండలాల విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు పున్నాన నరసింహులు నాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రతినెలా 1న వేయాల్సిన పెన్షన్లు చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. సకాలంలో పెన్షన్లు చెల్లించకపోవడంతో వారి ఆరోగ్య సమస్యలకు, భృతికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నెల 4వ తేదీ కావస్తున్నా పెన్షన్లు చెల్లించలేదని అన్నారు.

ప్రోత్సాహకాలను అందజేస్తున్న శ్రీనివాసరావు

30 మంది రక్తదానం

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యాన కొంచాడ రాజేశ్వరరావు విద్యాసంస్థలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకుల నుంచి 30 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రోటరీ సేవలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన పి.సత్యప్రసాద్, కె.గాయత్రి, పి.నవీనాలకు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్త సుజాత

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

పెద్దాపురం కెవికె శాస్త్రవేత్త సుజాత

ప్రజాశక్తి- లావేరు

మొక్కజొన్న పంటలో కలుపు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని పెద్దాపురం కెవికె శాస్త్రవేత్త సుజాత అన్నారు. బుధవారం పెద్దలింగాలవలసలో ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సౌజన్యంతో రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుపు యాజమాన్యం యాంత్రికరణను ఉపయోగించి పని భారాన్ని తగ్గించి, పెట్టుబడులు తగ్గించుకోవడం వలన అధిక దిగుబడులతో పాటు అధిక లాభాలు సాధించి వచ్చన్నారు.

రైతులందరు ఈ జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పల నాయుడు, డాక్టర్ రెడ్డీస్ డిప్యూటీ మేనేజర్ ఆర్. హరిబాబు, రాగోలు కెవికె కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, శ్రీకాకుళం ఏరియా మేనేజర్ పి. తవిటినాయుడు, రైతులు పాల్గొన్నారు.

అర్హతలను బట్టి ఉద్యోగోన్నతులు

సాంఘిక భద్రత అమలుపై హర్షం

పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో పెండింగ్‌లో ఉన్న వ్యక్తిగత సమస్యలు, ఉద్యోగోన్నతులు పరిష్కరించాలని ఎపి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జెడ్‌పి యూనిట్ అధ్యక్షులు దుంపల అప్పన్న కోరారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సంఘం సమావేశం నిర్వహించారు. ప్రధానంగా వివిధ కారణాల రీత్యా మృతి చెందిన జెడ్‌పి యాజమాన్య పరిధి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సకాలంలో సాంఘిక భద్రత పథకం ద్వారా ఉద్యోగాలు కల్పించినందుకు చైర్‌పర్సన్ పిరియా విజయా సాయిరాజ్, సిఇఒ వెంకటరామన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ క్యాడర్ల ఖాళీల్లో అర్హులైన ఉద్యోగులకు ఉన్నతి కల్పించాలని కోరారు. అలాగే ఫారిన్ సర్వీసుపై ఐటిడిఎ, డ్వామా శాఖలకు వెళ్లేందుకు ఆశక్తి ఉన్న వారికి నియమించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామోశ్వరరావు, పాత్రో ఇతర నాయకులు హాజరయ్యారు

వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి- పోలాకి

విద్యార్థులు కష్టమని భావించకుండా ఇష్టంతో చదివినట్లయితే మంచి ఫలితాలు సాధిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ కె.గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తాను ఎంచుకున్న సబ్జెక్టులపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం పోటీతత్వం ఎక్కువగా ఉందని, ఎంత బాగా చదివితే అంత మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. అనంతరం గతేడాదిలో బోటని, కెమిస్ట్రీ విభాగాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించిన 11 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో త్రినాథరావు, బి.ఎల్.వి.నర్సింహులు, కె.రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోల్డ్ మోడల్‌తో విద్యార్థులు

ఎబి రోడ్డు గుంతలు పూడ్చేది ఎప్పుడు ?

గుంతలో ఇరుక్కున్న ఇసుక లారీ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జిల్లా కేంద్రం నుండి సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు, భామిని, బత్తిలి, పాతపట్నంతో పాటు ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లే ప్రధాన రహదారి అలికాం-బత్తిలి రోడ్డు గుంతల పూడ్చేది ఎప్పుడని మండల ప్రజలు పలువురు ప్రశ్నిస్తున్నారు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుండి ఆర్‌టిసి బస్‌స్టేషన్ వరకు ఏర్పడ్డ భారీ గుంతల వలన గత నాలుగు నెలలుగా తరచూ ప్రమాదాలు జరగడమే కాకుండా గుంతల్లో లారీలు ఇరుక్కుని రాకపోకలు స్తంభించి నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం తెల్లవారుజామున అలికాం-బత్తిలి రహదారిపై ఆర్‌టిసి బస్టాండ్‌కు దగ్గరలో ఉన్న భారీ గుంతలో గుణుపూర్ నుండి విశాఖపట్నం వెళ్తున్న ఇసుక లారీ గుంతలో ఒక్కసారిగా దిగబడడంతో లారీ వెనుక చక్రం గుంతలో ఇరుక్కుని యాక్సిల్ విరిగిపోవడంతో ఇసుకలారీ గుంతలోనే ఉండిపోయింది. లారీ డ్రైవర్ వెంటనే లారీ ఆపివేయడంతో లారీ బోల్తా కొట్టకుండా పెద్ద ప్రమాదం తప్పిందని సంఘటన స్థలంలోని వ్యక్తులు చెబుతున్నారు. ఇటీవల కూడా ఇదే గుంతలో రెండు లారీలు ఒకేసారి ఇరుక్కుపోవడంతో ఎబి రహదారిపై సుమారు 8 గంటల పాటు రహదారిపై వాహనాలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. స్థానిక పోలీసులు ఇటీవల గుంతలను తాత్కాలికంగా పూడ్చినప్పటికీ ఇటీవల వర్షాలు కురవడంతో గుంతలన్నీ యధావిధిగా మళ్లీ ఏర్పడడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత ఆర్అండ్‌బిశాఖ అధికారులు స్పందించి అలికాం-బత్తిలి రహదారి గుంతలను పూడ్చి ప్రమాదాలను, ప్రజల ఇబ్బందులను తొలగించాలని మండల ప్రజలు పలువురు కోరుతున్నారు.

గుంతలో ఇరుక్కున్న లారీ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- పలాస

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని చినంచల సచివాలయ ప్రాంగణంలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యాన బుధవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో మేరాభారత్ మీరామిట్టి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ చేయాలని కోరారు. గ్రామాల్లో మొక్కలు నాటడం, పరిసరాలు పరిశుభ్రత ప్రజలందరూ వ్యక్తిగత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచరన సుజాత, ప్రతినిధి భాస్కరరావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.సునీల్‌కుమార్, ప్రశాంతి, అంజలి, మండల పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది విజయ్ కుమార్, గ్రీన్ ఆర్మీ సభ్యులు బొత్స మధు, ప్రదీప్ పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

జూనియర్ అసిస్టెంట్‌గా మాధురి ఎంపిక

సోంపేట: పట్టణంలోని తెలగ వీధికి చెందిన వారణాసి మాధురి ఇటీవల విడుదలైన గ్రూప్-4 పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి రెవెన్యూశాఖలో ఉద్యోగం సాధించింది. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా మాధురి ఎంపికైనట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఆమె సాధించిన ఈ విజయంపై వుయ్ ఫర్ యు గ్రంథాలయ నిర్వాహకులు, సభ్యులు తమ అభినందనలు తెలియజేశారు. తమ గ్రంథాలయంలో రీడర్‌గా ఉన్న మాధురి, ఈ విజయం సాధించడం తమకెంతో ఆనందంగా ఉందని, ఈ విజయం మరెందరో పాఠకులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.

బాలలను పనిలో పెడితే చర్యలు

ఇచ్ఛాపురం : బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని మానవ అక్రమ నిరోధక విభాగం ఎస్ఐ కేశవరావు, సమగ్ర శిక్షా అభియాన్ అధికారి జనార్ధనరావు, ఐసిపిఎస్ విభాగం సీతారాం, లేబర్ ఆఫీసర్ విజయకుమార్ హెచ్చరించారు. చైల్డ్‌లైన్. బ్రెడ్స్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి బుధవారం దుకాణాలు, బైక్ మెకానిక్ షాపులను తనిఖీ చేశారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన జర్నలిస్టు బాడ నటరాజ్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. శస్త్ర చికిత్స నిమిత్తం ప్రభుత్వం తరపున ఆదుకోవాలని మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజుకు కలిసి కోరారు. దీంతో సిఎం సహాయనిధికి దరఖాస్తు చేశారు. దీంతో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5.40 లక్షలు మంజూరైంది. బుధవారం ఆ చెక్కును నటరాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, జర్నలిస్టులు అంది రాము, అశోక్, నారాయణరావు, భాస్కరరావు, తిరుమల, వైస్ చైర్మన్ మీసాల సురేష్, మాజీ కౌన్సిలర్ శాంతకుమారి, రమణ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

చదువుతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆటల పోటీల్లో బ్రాహ్మణతర్లా జెడ్‌పి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు అండర్ -17 విభాగంలో పి.యజ్ఞం, ఖోఖోలో పి.పుష్పావతి టెన్నికాయిడ్‌లో రాష్ట్రస్థాయిలో పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిఇటి పద్మలోచనం, ఉపాధాయయులు పాల్గొన్నారు.

అభినందనలు తెలుపుతున్న వైకుంఠరావు

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీలేఖ ఎంపిక

అభినందిస్తున్న హెచ్ఎం హేమనాచార్యులు

కోటబొమ్మాళి : మండలంలోని నీలంపేట జెడ్‌పిహెచ్ఎస్‌లో 5వ తరగతి చదువుతున్న పులి శ్రీలేఖ ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో యోగా అండర్-14 విభాగంలో ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు లఖినేని హేమనాచార్యులు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం హెచ్ఎం, పీడీ ఆర్.వాణిశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దివానిపాలెం విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో స్విమ్మింగ్ విభాగంలో మండలానికి ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంఇఒ ధనుంజయ మజ్జి తెలిపారు. ఈ మేరకు అండర్-14 (100 మీటర్లు) విభాగంలో వారధి ఉపేంద్ర వర్మ, అండర్-17 (200 మీటర్ల) విభాగంలో జోగి మహేంద్ర, అండర్-17 (400 మీటర్ల) విభాగంలో వంక జగదీష్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరిని బుధవారం పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.ఎస్.ఎం తనూజ, ఉపాధ్యాయులు ఎం.మురళీప్రకాష్, బెందాళం వెంకటేశ్వరరావు, టి.రవి, లమ్మత, మురళి అభినందించారు.

82మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలోని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన 82 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 22 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పెద్దలింగలవలసకు చెందిన లావేరు ఎపిఎస్ మాజీ అధ్యక్షుడు మీసాల అప్పారావును ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, సాలూరు నియోజకవర్గ పరిశీలకులు మీసాల నీలకంఠం బుధవారం పరామర్శించారు. అప్పారావు తల్లి నారాయణమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని పరామర్శించారు. ఈసందర్భంగా సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట లుకలాపు అప్పలనాయుడు, గొర్లె రామినాయుడు, సొసైటీ సిఇఒ మీసాల సత్యనారాయణ, అప్పల నాయుడు, మీసాల నారాయణరావు, పి. గురునాయుడు ఉన్నారు.

ఎరువుల పంపిణీ

మెళియాపుట్టి : మండలంలో పరశురాంపురం రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు రెండో విడత ఎరువులను వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు బుధవారం పంపిణీ చేశారు. సరైన సమయంలో రైతుల వద్దకే ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, సహాయకులు దుక్క శరత్‌కుమార్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

ఎరువులను పంపిణీ చేస్తున్న ఆదినారాయుడు